క్లుప్తంగా

వలస కార్మికులను ఇబ్బందులు పెట్టొద్దు



ఒడిశా కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ కృష్ణయ్య

రామగిరి(నల్లగొండ): ఇటుక బట్టీల్లో పని చేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను యజమానులు ఇబ్బందులు పెట్టొద్దని తిప్పర్తి తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. జిల్లా కలెక్టర్, నల్లగొండ ఆర్డీఓ ఆదేశాల మేరకు శనివారం తిప్పర్తి మండలంలోని ఇండ్లూరు సమీపంలో గల ఇటుక బట్టీని ఆయన తనిఖీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా బట్టీలో పనిచేస్తున్న బాలకార్మికుల వివరాలను సేకరించారు.

నిత్యావసర సరుకులు అందజేత



సరుకులు అందజేస్తున్న బంజారా మహిళా సంస్థ చైర్మన్ ఆనంద్‌కుమార్

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని గొల్లగూడలో డ్వాబ్ సంస్థచే నిర్వహించబడుతున్న అంధుల పాఠశాలకు బంజారా మహిళా సంస్థ చైర్మన్ డా. ఆనంద్‌కుమార్ శనివారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పానుగోటి చొక్కారావు, దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్ర



నకిరేకల్ పట్టణంలోని మూసీ రోడ్డులో పర్యటిస్తున్న దైద రవీందర్

నకిరేకల్: పట్టణంలోని మూసీ రోడ్డు, పద్మశాలీ కాలనీలో శనివారం టీపీసీసీ నేత దైద రవీందర్ హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు గాజుల సుకన్యశ్రీనివాస్, దైద స్వప్న, నాయకులు యూసుఫ్, వంటిపాక నక్షత్, సతీష్, చెరుపల్లి సైదులు, ధనమ్మ, పొట్టబత్తుల నరేష్ సైదులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలను ఎత్తివేయాలి



చిట్యాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

చిట్యాల: వ్యవసాయానికి అప్రకటిత విద్యుత్ కోతలను ఎత్తివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ చిట్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు నారబోయిన శ్రీనువాసులు, శీలా రాజయ్య, రుద్రారపు పెద్దులు, కొలను దశరథ, లోడే విష్ణుమూర్తి, బెలిజ మల్లయ్య, పెద్దగోని మారయ్య, చిర్రబోయిన మల్లేష్, మెండె తిరుమలేష్, ఆగు లింగస్వామి, జంగిలి యాదయ్య పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత

చిట్యాల: మండలంలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన దుకుణాల రాంబాబు అనారోగ్యంతో పది రోజుల క్రితం మృతిచెందాడు. రాంబాబుతో పాటు మండలంలోని పెద్దకాపర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో 2000–01లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు తాము సేకరించిన రూ.82,500 నగదును శనివారం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చేకూరి మల్లేష్, పోషబోయిన యాదయ్య, జంజు రాజు, తెల్సూరి నాగేష్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి ఆరు గంటలే !

- అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్న రైతులు
- రోజులో కేవలం ఐదారు గంటలే వస్తున్న త్రీఫేజ్ కరెంట్
- ఎండిపోతున్న పంటలు
- రాత్రి వేళ పొలాల వద్దే వేచిచూస్తున్న అన్నదాతలు



సరంపేటలో మోటారును చెక్ చేసేందుకు త్రీఫేజ్ విద్యుత్ కోసం ఎదురుచూస్తున్న మెకానిక్



వట్టిపల్లిలో ఎండిపోతున్న వరి చేనును చూపుతున్న రైతు

మర్రిగూడ: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ నిరంతరాయంగా 24గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న మాటలు ఒట్టి నీటి మూటలేనని రైతులు ఆరోపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత పది రోజుల నుంచి అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తూ రైతన్నల ఆశలకు గండి కొడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే మెసేజ్ ద్వారా ఒకే విద్యుత్ సరఫరా విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. కానీ ఉదయం ఇవ్వాల్సిన త్రీఫేజ్ మధ్యాహ్నం 12, 1 గంటల మధ్య అందించి సాయంత్రం 4, 5గంటల లోపే తీసివేస్తున్నారని రైతులు వాపోతున్నారు. రాత్రి కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులతో పొలాల వద్దే పడిగాపులు కాస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు.

లో, హై ఓల్టేజీలతో తిప్పలు..

లో ఓల్టేజీ విద్యుత్ సరఫరాతో వ్యవసాయ పొలాల వద్ద స్టార్టర్లు, మోటార్లు దెబ్బతింటున్నాయి. హై ఓల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. పంట పెట్టుబడితో పాటు మోటార్ల రిపేర్లకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్రిగూడ మండల వ్యాప్తంగా వానాకాలంలో 37వేల ఎకరాల్లో పత్తి, 4వేల ఎకరాల్లో వరి, 1200 ఎకరాల్లో కూరగాయలు సాగు చేయగా, యాసంగిలో 5200 ఎకరాల్లో వరి, 1022 ఎకరాల్లో కూరగాయలు, 54 ఎకరాల్లో వేరుశెనగ, 16 ఎకరాల్లో ఆముదంతో పాటు ఇతర పంటలు సాగు చేశారు. ఈ పంటలు వేసిన దగ్గర నుంచి కోతకు వచ్చే వరకు సరైన సమయంలో నీటి తడులు అందించాలి. కానీ అప్రకటిత విద్యుత్ కోతలతో నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు త్రీఫేజ్ విద్యుత్ కోసం కంటికి మీద కునుకు లేకుండా పొలాల వద్దకు పరుగులు పెడుతున్నామని రైతులు అంటున్నారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కరెంట్ వచ్చిపోయేది తెలియదు



పంటలకు నీరు పెడదామంటే కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో అర్థంకాని పరిస్థితి. వానాకాలంలో కరెంట్ కోతలు ఉన్నా వానలు ఆదుకునేవి. ఎండాకాలంలో వానలు లేవు, కరెంట్ కూడా ఉండడం లేదు. ఒక్కో రోజు ఉదయం గంట, రెండు గంటలు మాత్రమే త్రీఫేజ్ వస్తుండడంతో పొలాలు ఎండే పరిస్థితి నెలకొంది.

– ఏర్పుల సంజీవ, రైతు, లెంకలపల్లి

రోజంతా అక్కడే ఉంటున్నాం



పాడైపోయిన మోటార్లకు మరమ్మతులు చేసి పొలం వద్దకు తీసుకెళ్లి బిగించిన తర్వాత విద్యుత్ కోసం రోజంతా అక్కడే పడిగాపులు కాయాల్సి వస్తుంది. విద్యుత్ ఉంటే బిగించిన అనంతరం చెక్ చేసి వచ్చేవాళ్లం. కరెంట్ సరిగ్గా ఉండక పొలాలు ఎండుతుండడంతో పాటు రోజుల తరబడి మోటార్ల బిగింపు కోసం పడిగాపులు కాయాల్సి వస్తుంది.

– ఉప్పు మహేష్, మెకానిక్, వట్టిపల్లి

విద్యుత్ డిమాండ్ పెరిగింది



గతంలో కంటే ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 17శాతం పెరిగింది. డిమాండ్ పెరగడంతో సప్లయ్ తగ్గింది. హైదరాబాద్‌లోని విద్యుత్‌శాఖ నుంచి నల్లగొండ కంట్రోల్ రూంకు అక్కడి నుంచి మండలాలకు మెసేజ్‌లు వచ్చిన తర్వాతే విద్యుత్ సరఫరా జరుగుతుంది. తరచూ ఫోన్‌లు వస్తున్నాయి. సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపుతున్నారు.

– రాజేష్, విద్యుత్ ఏఈ, మర్రిగూడ

పీఈటీలకు పదోన్నతులు కల్పించాలి



ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న తెలంగాణ ప్రాంత వ్యాయామ ఉపాధ్యాయ సంఘం సభ్యులు

నల్లగొండ టూటౌన్: ప్రభుత్వం పీఈటీలకు పదోన్నతులు కల్పించేలా చొరవ తీసుకోవాలని తెలంగాణ ప్రాంత వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి నంద్యాల రాజశేఖర్‌రెడ్డి శనివారం నల్లగొండలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2018 నుంచి సర్వీస్ బుక్‌లో రాసుకొని అప్‌గ్రేడేషన్ అమలు చేయకపోవడంతో మిగతా ఎస్‌జీటీ సమాన కేటగిరీకి చెందిన వారు సీనియారిటీలో ముందుకు పోతున్నారని అన్నారు. కోర్టు కేసులతో సంబంధం లేకుండా ఎస్‌జీటీలతో కలిపి కామన్ సీనియారిటీ ప్రకారం పీఈటీలకు అప్‌గ్రేడ్ అయిన పోస్టులను పదోన్నతులతో నింపాలని కోరారు. ఆయన వెంట పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉచిత కోచింగ్‌ను ఉపయోగించుకోవాలి



కోచింగ్ తీసుకుంటున్న అభ్యర్థులతో మాట్లాడుతున్న గుత్తా అమిత్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో నల్లగొండలోని టీఎన్‌జీఓ భవన్‌లో ఇస్తున్న ఉచిత కోచింగ్‌ను ఎస్సై, కానిస్టేబుల్, గ్రూప్–4 ఉద్యోగార్థులు ఉపయోగించుకొని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ట్రస్టు చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి అన్నారు. ఉచిత కోచింగ్‌ను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. 15 సంవత్సరాల అనుభవం గల ఫ్యాకల్టీతో కోచింగ్ ఇస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఆయన 63 బాపిస్టు మహిళా అసోసియేషన్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ దుబ్బ అశోక్‌సుందర్, బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు దుబ్బ రూప, ఐతగాని స్వామిగౌడ్, బషీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ధర్నా



ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజా పోరాట సమితి నాయకులు

నకిరేకల్: వ్యవసాయానికి ఉదయం వేళ 12గంటల పాటు విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన కరెంట్‌ను సరఫరా చేయాలని కోరుతూ ప్రజా పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్‌లోని విద్యుత్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీఈ) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి, నాయకులు యాకాలి శ్రీనివాస్, బంటు అంజి, పోలగోని కుమార్, కప్పల రాకేష్, ఆకారం భిక్షమయ్య, మహమ్మద్ ఖాసీం, జిల్లా సత్యం, ఎలిజాల భిక్షం, కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గం

నల్లగొండ టూటౌన్: తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘం రాష్ట్ర చైర్మన్ కుతాటి శ్రీనివాస్‌ను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని, అతడిని వెంటనే విడుదల చేయాలని సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మానుపాటి భిక్షమయ్య, పందుల అంజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. శ్రీనివాస్ పారిశ్రామికవేత్తగా, రాజకీయంగా ఎదుగుతుంటే కొంతమంది కుట్రపూరితంగా కేసులు పెట్టి అతడిని అరెస్టు చేయించడం సరికాదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేడ సైదులు, జిల్లా కార్యదర్శి వెలుగు రమేష్, ప్రచార కార్యదర్శి మానుపాటి పరుశురాం పాల్గొన్నారు.

శ్రీనివాస్‌ను వెంటనే విడుదల చేయాలి

శాలిగౌరారం: కూతాటి శ్రీనివాస్‌ను వెంటనే విడుదల చేయాలని ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుల్తాన్ ఎల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. శ్రీనివాస్ రాజకీయ ఎదుగుదలను చూడలేక ప్రభుత్వం అక్రమ అరెస్ట్‌లకు పాల్పడుతుందన్నారు. శ్రీనివాస్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రస్తాపురం వెంకన్న, మండల అధ్యక్షుడు మేడ గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

పెండింగ్ డీఏ విడుదల చేయాలి



రిటైర్డ్ ఉద్యోగులను సన్మానిస్తున్న సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

నల్లగొండ: పెన్షనర్లకు బకాయి పడిన రెండు డీఏలను, నగదు రహిత వైద్యానికి సంబంధించిన జీఓను త్వరలో విడుదల చేయాలని నల్లగొండ మండల యూనిట్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని పెన్షనర్ల భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈహెచ్‌ఎస్ ప్రకటించినందుకు గాను ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఈ నెలలో పుట్టిన రోజు జరుపుకుంటున్న పలువురు రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో కోశాధికారి జెల్లా పుల్లయ్య, ఎం. శేషారెడ్డి, రమేష్, గోపాల్‌రెడ్డి, రఘునాథం, మోహన్‌రావు, ఆంజనేయులు, రామలింగం, ముత్యాల కష్ణయ్య, యుగంధర్‌రెడ్డి, మహబూబ్ హుస్సేన్, చల్లా శ్రీశైలం, వారం సంతోష్‌రెడ్డి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

నల్లగొండ రూరల్: కనగల్ మండలంలోని తిమ్మన్నగూడెం గ్రామానికి చెందిన బింగిలి భిక్షం శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ తండు సైదులుగౌడ్ గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు, ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు యాదవ్ కూడా రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భిక్షంయాదవ్, సర్పంచ్ రమేష్, నర్సింగ్ మురళి, విజయ్, ఎరమేష్, కొండల్, సైదులు, యాదయ్య, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే అర్హత ప్రతిపక్షాలకు లేదు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున

నల్లగొండ టూటౌన్: సీఎం కేసీఆర్‌ను విమర్శించే అర్హత టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు లేదని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున అన్నారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్య, వైద్య రంగంలో రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. ఒక్క మెడికల్ కళాశాల, నవోదయ, ఐఐఎం విద్యా సంస్థలను కూడా కేంద్రం ఇవ్వకున్నా రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంటే సీఎంపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో పెరిక దివాకర్, నోముల క్రాంతియాదవ్, చింతకాయల శివ, రఘు, నిఖిల్, గణేష్, నవీన్, రాజు, కృష్ణ, వంశీ, మధు తదితరులు పాల్గొన్నారు.

మందడి నరసింహారెడ్డి మృతి తీరని లోటు

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



మందడి నరసింహారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న పల్లా వెంకట్‌రెడ్డి తదితరులు

చండూరు: చండూరు వైస్ ఎంపీపీ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మందడి నరసింహారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు అన్నారు. మండలంలోని పుల్లెంల గ్రామంలో శనివారం నిర్వహించిన మందడి నరసింహారెడ్డి సంతాప సభకు వారు హాజరై నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మందడి నరసింహారెడ్డి మునుగోడు నియోజకవర్గంలోని పేద ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు చేశారని గుర్తుచేశారు. పుల్లెంల గ్రామంలో 150 మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించిన ఘనత మందడికే దక్కిందన్నారు. మండలంలోని చిన్న నీటి వనరులైన బెండలమ్మ చెరువు, శేషిలేటి వాగు, నక్కలగండి ప్రాజెక్టుల నిర్మాణం కోసం చేపట్టిన ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించాడని కొనియాడారు. అన్ని గ్రామాల్లో పార్టీ, ప్రజాసంఘాలను బలోపేతం చేశారని కొనియాడారు. సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, మల్లెపల్లి ఆదిరెడ్డి, నర్సింహారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్, పల్లా దేవేందర్‌రెడ్డి, ఎల్. శ్రావణ్ కుమార్, నరసింహ, గాలయ్య, ఆర్. అంజయ్యాచారి, టి. వెంకటేశ్వర్లు, కుమార్, భిక్షంరెడ్డి, చాపల శ్రీను, రమేష్, పల్లె శేఖర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మరబోయిన వెంకన్న తదిరులు పాల్గొన్నారు.

ఎంపీ కోమటిరెడ్డివి మతిభ్రమించిన మాటలు

- బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న చాడ కిషన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి విమర్శించారు. శనివారం నల్లగొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుంటానని సీఎం కేసీఆర్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం.. పట్టణంలో రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులు, ఫ్లైఓవర్ల నిర్మాణం, కళాభారతి, మెడికల్ కళాశాల భవనం, ఎన్‌జీ కళాశాల నూతన భవనం, ఉదయం సముద్రంలో ట్యాంక్‌బండ్ నిర్మాణానికి దాదాపు వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించారని అన్నారు. నల్లగొండను ఇంతలా అభివృద్ధి చేస్తుంటే ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్యమంత్రిపై ఇష్టానుసారంగా మాట్లాడడం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో ఐటీ మంత్రిగా పనిచేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లాలో ఐటీ హబ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్ జిల్లా కేంద్రానికి వచ్చి ఐటీ హబ్‌కు శంకుస్థాపన చేసిన నాటి నుంచి యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయన్నారు. ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ నారబోయిన భిక్షంయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పోలే వెంకటాద్రి, ముక్కముల్ల వెంకన్నయాదవ్, నరసింహ, ఎస్‌కే లతీఫ్, కర్నాటి మల్లేష్, కట్ట శ్రీనివాస్, కంచర్ల శ్రీనివాస్‌గౌడ్, కొండాపురం అరుణ్ పాల్గొన్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. శనివారం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జాబ్ మేళా ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. సుమారు 80 కంపెనీలతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ జాబ్ మేళాను శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, నల్లగొండ రెడ్‌క్రాస్ చైర్మన్ అమరేందర్‌రెడ్డి, జేఏసీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 5వేల మంది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. జాబ్ వచ్చిన వారికి వెంటనే నియామక పత్రాలు అందజేస్తామని వివరించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వంటిపాక ఏసురత్నం, నాయకులు కొండ వెంకన్న, వేమవరపు నర్సింహులు, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, చెవుగోని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదల ప్రజల సంక్షేమం



మాట్లాడుతున్న బీజేపీ మునుగోడు నియోజకవర్గ ప్రభారీ అంజయ్యయాదవ్

మునుగోడు: బీజేపీ పరిపాలనతోనే దేశంలోని పేద ప్రజల సంక్షేమం సాధ్యమని పార్టీ మునుగోడు నియోజకవర్గ ప్రభారీ మర్రిపల్లి అంజయ్యయాదవ్, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతపాక సాంబయ్య అన్నారు. శనివారం మండలంలోని కొంపల్లి గ్రామంలో నిర్వహించిన శక్తి కేంద్రం సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి వాటిలో ఏ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. రైతులకు 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెప్పి కనీసం 8 గంటలు కూడా ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాలల్లో బీజేపీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ అధికారం దక్కించుకునేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు జాల వెంకన్నయాదవ్, పగిళ్ల భిక్షం, భవనం మధుసూదన్‌రెడ్డి, శక్తి కేంద్రం ఇన్‌చార్జి వీరమళ్ల సురేష్, బొడిగె అశోక్‌గౌడ్, కుంభం యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలి

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండా శ్రీశైలం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మేటిచందాపురం, ఇందుర్తి, తమ్మడపల్లి, తిరగండ్లపల్లి గ్రామాల్లో కౌలు రైతుల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, రుణమాఫీ, దళితబంధు, కౌలుబంధు అమలు చేయాలని కోరారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద కౌలు రైతులకు విత్తనాలు, క్రిమిసంహారక మందులను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. భూమి లేని నిరుపేదలకు, కౌలు రైతులందరికీ మూడెకరాల భూమి అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, ఉప్పునూతల వెంకటయ్య, నీలకంఠం రాములు, కొట్టం యాదయ్య, జంగారెడ్డి, కాగు వెంకటయ్య, రాజయ్య, కృష్ణయ్య, సోమయ్య, ఫకీర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

14న సర్వసభ్య సమావేశం

మర్రిగూడ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 14న ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జె. వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

వడ్డెర కులస్తులను ఎస్టీ కేటగిరీలో చేర్చాలి

చిట్యాల: వడ్డెర కులస్తులను ఎస్టీ కేటగిరీలో చేర్చాలని వైఎస్సార్‌టీపీ నకిరేకల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ పోకల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో శనివారం నిర్వహించిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వడ్డెర కులస్తులకు ఎస్టీ కేటగిరీలో చేరుస్తామని సీఎం కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లె రాజేందర్ గౌడ్, చిట్యాల పట్టణ అధ్యక్షుడు పోకల దామోదర్, నార్కట్‌పల్లి, రామన్నపేట మండలాల అధ్యక్షులు బాసని నర్సింహ, మేడబోయిన వెంకటేశ్వర్లు, నాయకులు పాపయ్య, నాగయ్య పాల్గొన్నారు.

రుణమాఫీ చేయడంలో ప్రభుత్వం విఫలం

మర్రిగూడ: రైతులకు పంట రుణాలు మాఫీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని టీడీపీ మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కలి ఐలయ్యయాదవ్ అన్నారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. 2018 ఎన్నికల్లో గెలిపిస్తే రూ.లక్ష వరకు పంట రుణమాఫీ చేస్తామని కేసీఆర్ చెప్పి నాలుగు సంవత్సరాలు దాటినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. 2023–24 చివరి బడ్జెట్‌లో కూడా రుణమాఫీకి సరైన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దోమల వెంకటయ్య, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి పగడాల లింగయ్య, మండల కార్యదర్శి పుప్పాల యాదయ్య, కాసర్ల అంజయ్య, మల్లేష్, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

శాలిగౌరారం: మండలంలోని ఆకారం గ్రామంలో ఉపాధి హామీ నిధులు రూ.5లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం స్థానిక సర్పంచ్ కందాల సమరంరెడ్డి, ఎంపీటీసీ వలిశెట్టి చంద్రకళతో కలిసి బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పోతుగంటి భిక్షపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కారింగుల పాండు, నాయకులు రాజు, లింగయ్య, యాదయ్య, శంకరయ్య, కిష్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ బోర్డు ద్వారా సర్టిఫికెట్లు పొందాలి

నల్లగొండ: జీఓ 317 ద్వారా నల్లగొండ జిల్లాకు అలాట్ చేసిన, ప్రస్తుతం బదిలీలకు అవకాశం ఉన్న ఉపాధ్యాయులు ప్రిఫరెన్సియల్ కేటగిరీ కొరకు ఈ నెల 12, 13, 14 తేదీల్లో మెడికల్ బోర్డు ద్వారా సర్టిఫికెట్లు పొందాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా. లచ్చూనాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన స్పెషల్ మెడికల్ బోర్డు ద్వారా సంబంధిత సర్టిఫికెట్లు పొందవచ్చని సూచించారు.

నల్లగొండలో డీవైఎఫ్ఐ సమావేశాలు

నల్లగొండ టౌన్: డీవైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాలు ఫిబ్రవరి 14, 15 తేదీల్లో నల్లగొండ పట్టణంలో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ తెలిపారు. శనివారం నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవన్‌లో నిర్వహించిన డీవైఎఫ్ఐ నల్లగొండ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు జరిగిన అన్యాయంపై డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటం చేసి చివరకు విజయం సాధించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్, జిల్లా నాయకులు గుండాల నరేష్, కార్లపూడి రాము, పాలాది కార్తీక్, బిట్టు, రేణుక, గోపీకృష్ణ పాల్గొన్నారు.